# తోడు

కె.కె. రఘునందన

మురారి మాస్టారున్న పెంకుటిల్లు ఓ వైపు జారిపోతోంది. వర్షం వస్తే ఇల్లంతా వరద... సామాన్లన్నీ చిందరవందరగా పడేసి ఉన్నాయి. అలమరలు చెదలు పట్టాయి. వెల్లవేయని గోడలు వెలవెల బోతున్నాయి. ఇంటి పరిసరాలు చెత్తా చెదారాలతో అసహ్యంగా ఉన్నాయి.

ఒకప్పుడు మాస్టారు అద్దె ఇంట్లో ఉన్నా ఇంద్రభవనంలా ఉండేది. కాని, ఇప్పుడు అందుకు విరుద్ధం.

మురారి మాస్టారు స్కూలు నుండి ఇంటికి వచ్చేలోగా మా దృష్టినపడ్డ చేదు నిజాలు అవి.

సాయంత్రం ఆరుగంటలకు ఇల్లు చేరిన మురారి మాస్టారిని చూడ్డంతోనే మా గుండెలొక్క సారి లయ తప్పాయి. ఆయన తల బాగా పండిపోయింది. చర్మం ముడుతలు బారి కాంతి హీనమైంది. గుంటలుపడ్డ కళ్ళల్లోంచి నీరసం ప్రతిఫలిస్తూంది.

ఎత్తరిగా ఉండి విగ్రహ పుష్టితో అలరారే ఆయన ఇంత నిస్సారమవటం అనంతాశ్చర్యాలకు లోను చేసింది. కనులు తడయ్యాయి.

"మురారి మాస్టారూ! నేను సంతోష్‌ను... వీడు రంజిత్... ఈమె నా భార్య ప్రవల్లిక. ముగ్గురం మీ ప్రియ శిష్యులం. మీరెలాగ ఉన్నారోనని చూద్దామని వచ్చాం" ఆర్తి నిండిన స్వరంతో అన్నాను.

మమ్మల్ని నఖశిఖ పర్యంతం ఓసారి చూసి "ఒరే భడవల్లారా! మీరా? ఇంతకాల మేమైనారర్రా... చూసార్రా...!! మీ మురారి మాస్టారిని... ఎంత బాగున్నారో... ఈ ఇల్లు... ఈ జీవితం...." ఒక్కోమాట అంటుంటే గొంతు డగ్గుత్తికతో పూడుకు పోయింది.



"మీరెందుకలా ఉదాసీనంగా మారి పోయారో మాకు అర్థంకాకనే మీ గురించి తెలుసుకోవాలని వచ్చాం..." మాస్టారి పాదాలను స్పృశిస్తూ రంజిత్ అన్నాడామాట...

"ఆ రోజుల్లో అమ్మగారు మా పిల్లలతో పాటుగా మీకూ చక్కెర పొంగళ్ళు పంచి పెట్టేది. జొన్నపొత్తులు కాల్చిచ్చేది...హు! అవన్నీ కలలోలా కరిగిపోయాయి బాబూ!" కనులు తుడుచుకుంటూ అన్నారు.

ఆయన అన్నది అక్షరసత్యం. మాస్టారి భార్య తమ పిల్లలతోపాటుగానే మమ్మల్నీ ప్రేమగా చూసేవారు... కడుపు నింపేవారు. మేం ఎప్పుడయినా గుమ్మంలోకి రాకపోతే చాలు వెంటనే పిలిపించేవారు... మేం కోపంతో అలగావేమోనని బాధపడి అక్కున చేర్చుకునేవారు. "అన్నట్లు... అమ్మగారు.." అర్థోక్తిగా అన్నాను.

"ఇంకెక్కడి అమ్మగారయ్యా! ఆమెకి తొందరొచ్చి పిల్లల్ని, నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోయింది. ఏదో ఇలా గడుపుతున్నాను... పిల్లలు ఎప్పుడో వస్తారు... పోతారు... ఇలా ఏదో ఈ చీకటి బ్రతుకు గడుపుతున్నాను" గుండెలోని ఆవేదన ఊటలై ఉబకసాగింది.

"అమ్మగారు పోవటం దురదృష్టమే! చీకటిని తలుచుకుంటూ ఎంతకాలమిలా బాధపడతారు? అన్నీ తెలిసిన మీరే ఇలా విరాగిలా మారటం మమ్మల్ని కలవర పరుస్తోంది మిమ్మల్ని చూస్తుంటే ఎంతో బాధగా ఉన్నది" అంది ప్రవల్లిక.

"మీరు మా అందరనీ సంస్కరించి ఉన్నతులుగా తీర్చిదిద్దారు. అటువంటి మీరలా ఉదాసీనంగా మారటం మాకు నచ్చలేదు. మీరు మరల ఒకప్పటి ఉత్సాహం, చైతన్యం నింపుకోవాలి. అదే మా ఆశ..." స్పందిస్తూ అన్నాను.

"ఎవరెంత చేసినా ఆ రోజులు మరి రావు సంతోష్... ఈ చీకటిలో... వెలుగులు నిండవు" ఆయనలో నిండుగా నైరాశ్యం.

"మీరలా అనకండి... మిమ్మల్ని ఆనందంగా చూడాలి. మీ కళ్ళల్లో వెలుగు నిండాలి. అందుకు మాకు మీరు సహకరించాలి. మా ఋణం ఈ విధంగా తీర్చుకోనివ్వండి" చేతులు పట్టుకుని చెప్పాను.

ఆ క్షణం మొదలు మేం ముగ్గురం పనుల్లో పడ్డాం. బూజు పట్టిన ఇంటిని దులిపాం. చెల్లాచెదురైన సామాన్లని ఓ తీరుగా సర్దాం. పరిసరాలు బాగుచేశాం. ఇల్లంతా కడిగి ముగ్గులు వేసింది ప్రవల్లిక. సాంబ్రాణి పొగ వేసింది. ఫోటోలలో గోడలను అలంకరించింది.

మురారి మాస్టారిని సెలూన్‌కి తీసుకువెళ్ళి విలక్షణంగా చేయించి తీసుకువచ్చాడు రంజిత్. ఆయనకు తలంటింది ప్రవల్లిక. ధవళ వస్త్రాలలో సాక్షాత్తూ విష్ణు మూర్తిలా సాక్షాత్కరించారు.

ఆరోజు శ్రీమతి ప్రవల్లిక చేతి వంట ఘుమఘుమలు రుచి చూపించింది. ఆబగా తిన్నారు మాస్టారు.

"చాలాకాలం తరువాత ఇంతటి రుచికరమైన భోజనం తిన్నాను. నేనింటికి రాగానే పిడికెడు మెతుకులు వడ్డించే ఆడతోడు కరువైందన్న బాధ నన్ను పీడిస్తోంది. పుణ్యస్త్రీ చావుతో ఆమె పుణ్యలోకాల చిరునామా వెతుక్కున్నా నాకు మాత్రం నరకం మిగిల్చింది. ఎన్నో రోజుల తరువాత మరల ఆప్యాయంగా పలకరించే మనుషులను చూస్తున్నాను" అని గుడ్ల నీరు కుక్కుకున్నారు.

ఆ రాత్రి ఎంతో ఉత్సాహంగా భాగవతంలోని పద్యాలు రాగయుక్తంగా పాడి వినిపించారు. తరువాత కమ్మటి నిద్రలో కూరుకుపోయారు.

"మాస్టారి జీవితంలో ఇంతటి నిరుత్సాహం... ఉదాసీనత ఎందుకు ప్రవేశించాయో అర్థమైపోయింది" అంది ప్రవల్లిక.

"ఈ సమయంలో మాస్టారికి కావలసింది తోడు. నిజానికి ఈ ఒక్క రోజులోనే ఆయనలో ఎంతో మార్పొచ్చింది. అయితే మనం ఎంత చేసినా అయినవాళ్ళు దగ్గరుండి చేసినట్లుగా ఉండదు." తన అభిప్రాయం బయటపెట్టాడు రంజిత్.

"మనం ప్రధానంగా చేయాల్సింది మాస్టారి పిల్లలు కౌశిక్, ప్రవాస్, అరుణిమలకు ఉత్తరాలు రాయటం... వారెలా ప్రవర్తిస్తారో వేచి చూడడం మన కర్తవ్యం. తరువాత మన పాత్ర ఏమిటో ఆలోచిద్దాం..." తేల్చి చెప్పింది ప్రవల్లిక.

రెండు రోజులు ఇట్టే గడిచిపోయాయి.

కొద్దిగా పోలియో ప్రభావం చిన్ననాడే సోకిన మురారి మాస్టారు రక్తబలం ఉన్న ఆ రోజుల్లో పెద్దగా బాధపడలేదు. ప్రస్తుతం మాత్రం కొంత లొంగక తప్పలేదు... మానసికంగా క్రుంగటంతో మరీ పాడయ్యారు.

అందుకే మాస్టారిని విడిచి వెళ్ళాలంటే మనసొప్పలేదు. కాని తప్పదు. మేం వెళతా మనగానే మురారి మాస్టారు పగిలిన నీళ్ళ కడవల్లే అయ్యారు.

"మాస్టరూ! మీరెంత మాత్రం చింతించకండి. మీకు ఏ అవసరం వచ్చినా సరే తక్షణం వాలతాం. మరలా ఎవరో ఒకరం వస్తాం లెండి" ధైర్యం చెప్పి నా ఫోన్ నెంబరు ఇచ్చాను.

ఇంటికి చేరాక మేం చేసిన మొట్టమొదట పని మురారి మాస్టారి కొడుకులు కౌశిక్, ప్రవాస్, కూతురు అరుణిమలకు ఉత్తరాలు రాయటం.

## సాఫీగా పనులు కావడానికి ఫెంగ్‌షుమ్ పద్ధతి



డేవిడ్ డేనియల్, ప్రొఫెసర్ ఇన్ యున్ గార్లు చెప్పిన పద్ధతి. మీరు అనుకునే పనుల వల్ల కలిగే శుభఫలితాలను మనసులో స్ఫురణకు తెచ్చుకోవాలి. పనులు ఎక్కడ మొదలు పెట్టి ఎలా పూర్తి అయి ఎలా అభివృద్ధి కలుగుతుందో మనసులో ఊహించుకోవాలి.

**ముద్ర:** ధ్యాన ముద్రకు చూపుడు వ్రేలిని బొటన వ్రేలుకు తాకించి ధ్యానిస్తాము. ఇది సర్వసాధారణంగా చూస్తుంటాము. ఫెంగ్‌షుమ్ పద్ధతిలో ముద్ర చాలా విలువైనది. ఈ ముద్రలో మధ్యవ్రేలిని బొటన వ్రేలికి తాకించి విదల్చాలి. తరువాత ఉంగరం వ్రేలిని బొట వ్రేలికి తాకించి విదల్చాలి. ఈ రెండు వ్రేళ్ళతో చేసిన రెండు కదలికలూ (విదల్చినవి) కలిపి ఒకసారి ముద్ర అవుతుంది. అలా 9 ముద్రలు చేసి భగవంతుడైన బుద్ధుని (తథాగతుడు) యందు మనసుంచి ధ్యానించాలి. పురుషులు ఎడమ చేతివ్రేళ్ళతోను, స్త్రీలు కుడి చేతి వ్రేళ్ళతోను ఈ ముద్రలు పాటించి ధ్యానించాలి.

భగవంతుడైన బుద్ధుని "ఓం మానీ పద్మహుం" అనే మంత్రాన్ని తొమ్మిదిసార్లు జపించి ధ్యానించాలి. పైన చెప్పిన విధంగా రోజుకి మూడు సార్లు ధ్యానిస్తే మీ పనులు సులువుగా సాఫీగా కొనసాగుతాయి. ఎవరికీ హాని కలిగించే పనులు, ఆలోచనలు మానివేయాలి. దీని వల్ల మీలో పాజిటివ్ థాట్స్, పాజిటివ్ ఎనర్జీ కలుగుతాయి. **– ఎ. పార్థసారధి, రామకృష్ణ**

సుమారు నెల రోజులకు వారి నుంచి జవాబులు వచ్చాయి.

"తండ్రిని చూడాల్సిన బాధ్యతను తమకు గుర్తు చేయాల్సిన అగత్యం ఎవరికీ లేదని... తీరికలు లేక రావటానికి కుదరదని" కౌశిక్ వ్రాసాడు.

"తమ కుటుంబ విషయాల్లో ఇతరుల జోక్యం అనవసరం" అంటూ కటువుగా ప్రవాస్-

"అత్తగారింటికి వెళ్ళిన తరువాత, భర్త ఇష్టం తప్ప తన ఇష్టం కాదని అది నేరంలా భావించటం తగదని, ఘోరమని" అరుణిమ వ్రాసింది.

సారాంశమంతా గ్రహించి మ్రాన్పడి పోయాం.

"ఇలా జరుగుతుందని ముందే ఊహించాం. కాని వారికి తెలియపరచటం మన ధర్మం. పోనీలెండి శిష్యులుగా మనమే వెళ్ళి వస్తూ వుందాం" ఉస్సురని నిట్టూరుస్తూ అన్నది ప్రవల్లిక.

ఒకరోజు మాస్టారిని చూడ్డానికి నేనే బయలుదేరాను. నేను వెళ్ళేసరికి మురారి మాస్టారు మంచంలో ఉన్నారు. నిరాహారదీక్ష చేస్తున్నట్లు కళ్ళు లోతుకెళ్ళాయి.

ఇల్లంతా యథాప్రకారం తయారయింది.

"మాస్టారు! మీరేంటిలా తయారయ్యారు? అరె జ్వరంతో ఉండి కూడా కనీసం ఎవరి చేతయినా ఫోనయినా చేయించారు కాదు" జాలిగా అడిగాను.

"కడుపున పుట్టిన పిల్లలకు పట్టని బాధ నీకెందుకయ్యా సంతోష్! మీ చేత చాకిరీలు చేయించుకోవటానికి నాకేం అధికారం ఉందని" ఆయన మనస్తాపంతో కన్నీళ్ళు పెట్టుకున్నారు.

"ఎంత మాటన్నారు. నిజంగా ఈరోజు పిడికెడు మెతుకులు కడుపులో కెళ్తున్నాయంటే అది మీరు పెట్టిన విద్యా భిక్ష మూలానే... అందువల్ల మామీద మీకు అధికారం తప్పకుండా ఉంది... ఏమయినా చెప్పండి... చేయడానికి సిద్ధంగా ఉన్నాం..." ఊరడిస్తూ అన్నాను.

"సొంత మనిషిలా ఎల్లవేళలా కనిపెట్టుకుని ఎవరుంటారు చెప్పు? అందువల్లే నాకు అన్నింటి మీదా విరక్తి పుట్టింది. మరికొంత కాలం పనిచేసి ఏ ఆశ్రమానికో వెళ్ళిపోతాను బాబూ!" ఆయనలో నిరాశా నిస్పృహలు కమ్ముకున్నాయి.

## మీకు తెలుసా?




మన కరెన్సీ నోట్లపై సంతకం కల్గిన ప్రధాని మన్‌మోహన్‌సింగ్ ఒక్కరే. ఎందుకంటే గతంలో ఆయన రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా పని చేసినప్పుడు, మన కరెన్సీపై ఆయన సంతకం ఉంది. విచిత్రంగా ఆయన ప్రస్తుతం దేశ ప్రధాని కావడంతో కరెన్సీపై సంతకం గల ప్రధానిగా గుర్తింపు పొందారు. **- పి. ఆదికేశవరావు**

"మీరలా నిరాశకు లోను కాకండి మాస్టారూ! ఎలాగయినా మిమ్మల్ని.... మామూలు మనిషిని చేస్తాం... అది మా బాధ్యత" అన్నాను.

మాస్టారు నా మాటల పట్ల విశ్వాసం ప్రకటించినట్లుగా ఆయన కళ్ళు కాంతి నింపుకున్నాయి.

ఆ రోజు మొత్తం నేను మురారి మాస్టారిని కనిపెట్టుకుని ఉన్నాను. అయితే సెలవులు లేని కారణంగా మర్నాడే వెళ్ళవలసి వచ్చింది.

## పల్లకి



**పుట్టినప్పుడు ఊయల పల్లకి**
**పెరిగేటప్పుడు అమ్మ కాళ్ళ పల్లకి**
**పెళ్ళయినప్పుడు ముత్యాల పల్లకి**
**పోయినప్పుడు మాత్రం గడ్డి పల్లకి**

**- ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి**

అక్కడ పిల్లలకు చూడమని చెప్పి కదిలాను.

"మీరు చెప్పిన దాన్ని బట్టి నాకంతా అర్థమైంది. తక్షణ కర్తవ్యం కూడా ఆలోచించాను. ఏ మనిషికయినా కలకాలం కావలసినది, మనసును ఆనంద తరంగాలలో ఓలలాడించేది ఒకే ఒక్కటి... అది మాస్టారికి అందించగలిగితే ఆయనకు బలవర్ధకమైన ఔషధంలా పని చేస్తుంది." పూర్వాపరాలు బాగా యోచించాక శ్రీమతి ప్రవల్లిక అంది.

"మాస్టారి పరిస్థితి చూస్తుంటే నాకు తెగ జాలేసింది. అయితే ఆయన కోసం ఎంత చేసినా ఋణం తీరదు. మాకంటే ఓ స్త్రీ ఆలోచనలు వేరుగా ఉంటాయి" అన్నాను.

"ఈ రోజే నేను ఒకర్తెనూ వెళ్ళి మాస్టారిని కలసి వస్తాను. ఆయన పరిస్థితిని ఓ కొలిక్కి తీసుకురావటానికి ప్రయత్నిస్తాను." సంతోషంగా చెప్పి బయలుదేరింది ప్రవల్లిక.

❋ ❋ ❋

"మురారి మాస్టారెలా ఉన్నారు?" రెండు రోజుల తరువాత తిరిగి వచ్చిన ప్రవల్లికను అడిగాను.

"మొదట మీరు చెప్పినట్లే ఉన్నారు. కాని నేను వెళ్ళాక అంతా సరిదిద్ది వచ్చాను." అన్నది ప్రవల్లిక.

"అంటే నువ్వు చేసింది"

"సస్పెన్స్.... మీరు చూసి రండి... మీకే తెలుస్తుంది... ఆయనలో ఎంత మార్పు వస్తుందో చూడండి" అంది తృప్తిగా.

ఆమె మాటలు విన్నాక రంజిత్, నేను విచికిత్సలో పడ్డాం. ఆ మర్నాడు సెలవు పెట్టి నేను, రంజిత్, మురారి మాస్టారి దగ్గరకు వెళ్ళాం. తలుపు తెరచి చూసిన మేం అమితాశ్చర్యానికి లోనయ్యాం. ఒక నడి వయస్కురాలు మాస్టారి జుత్తుకు నూనె రాస్తున్నది.

మమ్మల్ని చూస్తూనే ఆమె ఇటు తిరిగి నవ్వుతూ ఆహ్వానించింది. మాస్టారు కూడా ఆమె సాయంతో లేచారు.

ఆమె ఎవరో కాదు... మా ఊర్లో మా వీధి చివర నున్న రమణమ్మ. ఆమె భర్త ఎప్పుడో చనిపోయాడు. తనకో ఉపాధి లేక నానా అవస్థలు పడుతున్నది. ఈ విధంగా రమణమ్మ మాస్టారి చెంతనుండటం వింతగానే అనిపించింది.

"బాబూ! ఈ రమణమ్మ నా పాలిట దేవతలా వచ్చింది. అదీ నా శిష్యురాలు ప్రవల్లిక చలువ వల్ల" మనస్ఫూర్తిగా అన్నారామాట.

మాస్టారిలో జీవమున్న ప్రతిబింబం చూడ గలిగాం ఆ క్షణం.

"మీరు ఇలాగే ఆనందంతో, ఆరోగ్యంతో కలకాలం ఉండాలని, మీరున్న ఇల్లు కళకళ లాడాలని మనసారా కోరుకుంటున్నాం" అన్నాను.

"మీలో ఓ చైతన్యం చూసాం... అది ఎల్ల వేళలా నిలవాలని ఆకాంక్షిస్తున్నాను" రంజిత్ అన్నాడు.

"బాబూ! మాస్టారెప్పుడూ మీ కబుర్లే... చెబుతాడు. మీరంటే ఎంతో అభిమానం" నవ్వుతూ అంది రమణమ్మ.

"మీరు నా పట్ల చూపుతున్న ప్రేమాభి మానాలు ఎప్పుడూ ఇలాగే ఉండాలయ్యా" అని ఆనందభాష్పాలు తుడుచుకున్నారు.

మేం వెళ్ళాలని లేచాం.

"బాబూ! మీరీ రాత్రి భోజనం చేసి ఉదయమే వెళ్ళండి" బలవంతం చేశారు మాస్టారు.

"ఔను బాబూ! మీరుండండి" ఒత్తిడి చేసింది రమణమ్మ.

అయినా మేం బయలుదేరాం.

❋ ❋ ❋

"మాస్టారి విషయంలో చాలా మార్పు వచ్చింది. అది నీ పథకమని పోల్చకపోలేదు. కాని ప్రవల్లికా! ఈ మార్పు ప్రభావం మనందరి మీద దారుణంగా ఉంటుందేమోనని నా అనుమానం" అన్నాను ఇంటికి వచ్చాక.

"ఓ సంస్కరణకు పూనుకోవాలంటే ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కోక తప్పదు." నిశ్చయంగా అంది ప్రవల్లిక.


"లోకులు పలుగాకులు... వీటన్నింటినీ మాస్టారి పిల్లలకి ఎవరో ఒకరు చేరవేయక పోరు. అప్పుడు దీనికి కారకులమైన మనం ఎన్నో నిందలని భరించాల్సి ఉంటుంది".

"తప్పదండీ... వాళ్ళందరికీ ఈ విషయాలు తెలియడమే మంచిది. అది మాస్టారికే మేలు జరుగుతుంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకునే నేనీ పనికి నడుం బిగించాను" కృత నిశ్చయంగా అన్నది ప్రవల్లిక.

మరో వారం రోజులకు రంజిత్ మా దగ్గరకు వచ్చాడు.

"నేనీ మధ్య ఏదో పనుండి విజయనగరం వైపు వెళ్ళాను. మాస్టారిని చూడాలనిపించి గంట్యాడ వెళ్ళాను. నిజంగా రమణమ్మ సంరక్షణలో చాలా మెరుగయ్యారు. ఎంతైనా ఆడ తోడు ఆడతోడే..." అన్నాడు పొంగిపోతూ...

## ఐసు తెలివి!



ఐశ్వర్యారాయ్ ఇక హాలీవుడ్‌కెళ్ళి పోతోందంటూ వస్తున్న పుకార్లన్నీ ఐశ్వర్యా రాయే పని కట్టుకుని రేపుతున్నవేనట! ప్రతి సారీ ఇక ఐశ్వర్యారాయ్ బాలీవుడ్‌కి దూరమవుతుందంటూ పుకార్లు వినిపిస్తుండడంతో, ఐశ్వర్యకి రేటు పెరిగిపోతోందట. దీంతో ఐశ్వర్యారాయ్ కావాలనే ఇలా చేస్తోందని ఓ హిందీ పత్రిక అసలు విషయాన్ని కొన్ని సాక్ష్యాలతో ప్రచురించింది. అమ్మడి చిట్కా బాగానే వుంది! అసలు విషయం బయట పడడంతో ఈ విషయం గురించి నాకసలు తెలియదు. మా సెక్రటరీకేమైనా తెలుసేమో కనుక్కుంటానంటూ మాట దాటేసింది ఐశ్వర్యారాయ్.

నేను, ప్రవల్లిక, రంజిత్ మాస్టారి గురించి చెప్పిన కబుర్లన్నీ విని చాలా సంతోషించాం.

అయితే ఇది జరిగిన మరి వారం రోజులకే రంజిత్ మా దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"కొంప మునిగిందిరా సంతోష్! మురారి మాస్టారి సంతానం దిగారు. రమణమ్మను ఆయన దగ్గర చూడ్డంతోనే గంగవెర్రులెత్తి పోయారు. కూతురయితే మరీను... నానా రాద్ధాంతం చేస్తున్నది. వాళ్ళంతా మన మీద యుద్ధానికి దిగడానికి సిద్ధమవుతున్నారు" అన్నాడు.

"నీకిదంతా" ఆశ్చర్యంగా అడిగాను.

"గంట్యాడనుండి నా మిత్రుడొకడు వచ్చి నాకీ విషయమంతా చెప్పాడు... మనం వెళ్ళక పోతే మాస్టారు చిక్కుల్లో పడే ప్రమాదం ఉంది" అని నెత్తి పట్టుకున్నాడు.

ఆ మాట విన్న నా గుండెల్లో రాయి పడింది. శ్రీమతి ప్రవల్లిక మాత్రం చాలా ధైర్యంగా – "కాగల కార్యం గంధర్వులు తీర్చట మంటే ఇదే!" అంది.

"ప్రవల్లికా! నాకంతా అయోమయంగా ఉంది" ఆందోళనగా అన్నాను.

"ఈ కథంతా ముందుకి నడిస్తే గాని మీకు బోధపడదు. ముందు వెళదాం పదండి" నవ్వుతూనే అన్నది ప్రవల్లిక.

❋ ❋ ❋

మా ముగ్గురినీ చూస్తూనే మురారి మాస్టారి పెద్దకొడుకు కౌశిక్ చాలా వ్యంగ్యంగా "సంస్కర్తలకు స్వాగతం... మీకు కబురెలా వెళ్తుందాని కంగారు పడ్తున్నాను. ఆ శ్రమ లేకుండా మీరే దయ చేశారు. ఆ వెదకబోయిన తీగ కాలికి తగలటమంటే ఇదే కాబోలు..." అన్నాడు.

"మిమ్మల్ని ఎలా సన్మానించాలో మాకు బోధ పడ్డం లేదు. మా నాన్న గారి విషయంలో 'అతి' శ్రద్ధ వహించినందుకు కృతజ్ఞతలు" అన్నాడు ప్రవాస్.

"ఏభై ఏళ్ళ నాన్నగారికి సరసం మరపు కొచ్చిందనుకుని ఓ ఆడ తోడుని నియమించి నట్లున్నారే... మీ చేతి చలువ వల్ల ఇంతకాలం మాస్టారిగా మంచి పేరున్న ఆయనకు చెడ్డ ముద్ర పడేలా చేశారు" ఎకసక్కంగా అన్నది అరుణిమ.

"ఒరే! మీరు మా శిష్యులను ఒక్క మాటంటే ఒప్పేది లేదు". మిమ్మల్ని మధ్యలో అడ్డు పడ్డారు మురారి మాస్టారు.

"మీరు మధ్యలో కల్పించుకోవద్దు... ఈ ముగ్గురూ మీకేదో విషం తినిపించారు. మీ కడుపున పుట్టిన వాళ్ళం, మాకంటే మధ్యలో వచ్చిన వీళ్ళు ఎక్కువైపోయారు మీకు..." రుస రుసలాడారు కౌశిక్.

"ఈ వయసులో శృంగార పురుషుడిగా నలుగురి నోళ్ళలో నానటానికి మీకు సిగ్గులేదూ! పైగా మా శిష్యులు పెట్టిన భిక్షరా అని మా దగ్గర గొప్పగా పొగిడేరు...ఛీ!"

ఛీత్కరించుకుంటూ అన్నాడు ప్రవాస్.

మళ్ళీ కల్పించుకోబోయారు మురారి మాస్టారు.

"మీరలా ఆగండి మాస్టారూ! మమ్మల్నింకా ఏమైనా అనవలసి వుంటే అననీయండి. నువ్వనేదేంటి! కౌశిక్? మీ నాన్నగారికి మేం విషం తినిపించామా! ఏమమ్మా అరుణిమా! మీ నాన్నగారికి సరసాలు మప్పటానికి ఆడతోడును నియమించామా... చదువుకున్న సంస్కార వంతులు మీరేనా ఇలా మాటలాడుతున్నది... చెట్టంత మనిషిని పట్టుకుని అనడానికి నోరెలా వచ్చింది మీకు..." ముగ్గురినీ సూటిగా ప్రశ్నించాను.

"ఇంతకాలం మీ నాన్నగారెలా ఉంటున్నారో... ఏం తింటున్నారో తెలుసుకునేంత తీరికలేని మీకు ఈ మాటలనడానికి హక్కు ఉందో లేదో ఆలోచించండి" రంజిత్ అందుకున్నాడు.

"జీవితంలో తన అవిటితనం ఎవరికీ అడ్డు కాకుండా శక్తి ఉన్నంత కాలం మీ అందరూ ప్రాజ్ఞులయ్యేదాకా కృషి చేశారు. కాని ఇప్పుడిలా విరాగిలా మారటానికి కారణం ఎవరు? సరియైన తోడు లేకపోవటం... మీ నిరాదరణ... ఈ పరిస్థితి అంతా మా దృష్టికి వచ్చింది. తెలుసుకున్నాక మేం ఊరుకోలేక పోయాం. విషయమంతా ప్రత్యక్షంగా పరిశీలించాం. ఇంటికి రాగానే గుక్కెడు మంచినీళ్ళు పోసే దిక్కు కరువైంది. పిడికెడు అన్నం వండి పెట్టే అమృత హస్తం లోటయ్యింది. అందుకనే మీ నాన్నగారికి మాకు చాతనయిన సాయం చేశాం. చీకట్లో ఉన్న ఆయనకు వెలుగు చూపాం" అంది ప్రవల్లిక.

"చాలా గొప్ప పనే చేశారు మీరు... హవ్వ... ఈ వయసులో పెద్దరికానికి, హుందాతనానికి మారు పేరుగా నిలవాల్సిన మా నాన్నగారిని భ్రష్టుపట్టించడానికి మీరు చేసిన కుట్ర... ఇక్కడి భాగోతమంతా మాకు ఎప్పటికప్పుడు ఎవరెవరో ఉత్తరాలు రాస్తూనే ఉన్నారు" మండిపడ్డాడు కౌశిక్.

"కాబట్టి మీరు పరుగు పరుగున వచ్చారు... అంతేనా... అయితే మీ అమ్మగారు అకాలమరణం పొందగానే అవిటివారయిన మీ నాన్నగారికి మరో తోడు అవసరం అని, కడదాకా సేవలు అందించాల్సిన అవసరం ఉందన్న కనీసం జ్ఞానం మీకెందుకు కలుగలేదు... మీరు, మీ పిల్లలు... జీవితం... సుఖ సంతోషాలు... ఇవే మీరు ఆలోచించారు. ఇంకా మిగిలిన సర్వీసులో నాన్నగారెలా చేతులు కాల్చుకోగలరో... ఎలా మసలగలరో నని ఒక్కసారయినా... ఆలోచించారా?" నేను ఊరుకోలేకపోయాను.

"ఏభై ఏళ్ళప్పుడు తోడేమిటండీ.... నవ్విపోతుంది లోకం" విరక్తిగా అన్నది అరుణిమ.

"శభాషమ్మా! నాన్నగారికి తోడంటే ఓ కోణంలోంచే నువ్వాలోచించావు తప్ప పెద్ద మనసుతో ఆలోచించలేదు" అంది ప్రవల్లిక.

"ఆయన్ను మా దగ్గరకొచ్చి ఉండద్దన్నామా...." దీర్ఘాలు తీసింది అరుణిమ.

"ఇంకా సర్వీసున్న ఆయన మీ దగ్గరకెలా రాగలరు... వచ్చినా మీరు ఆయన కోసం ఎంత సమయం కేటాయించగలరు?" ధైర్యంగా అడిగాడు రంజిత్.

"మీ అమ్మగారు పోయినా, పెళ్ళి చేసుకోవాలన్న ఆలోచనలు రానీయకుండా మీకోసం త్యాగం చేసారు. కాని ఆడతోడు లేని లోటు కొట్టొచ్చినట్లు కనిపించింది. రక్తబలం తగ్గి సొంతంగా పనులు చేసుకోలేని స్థితి ఏర్పడింది. అది గ్రహించే మేం మాస్టారి సేవల కోసం ఓ మనిషిని తోడుగా ఏర్పాటు చేస్తే లోకంతో పాటు మీరూ వేరే రకంగా అర్థం చేసుకున్నారు" ధ్వజమెత్తాను.

మా మీదకి ఎదురు దాడికి దిగటానికి వాళ్ళు జంకుతున్నట్లుగా కనిపించింది.

"ఇంతకీ.... రమణమ్మ ఎక్కడ?" అడిగింది ప్రవల్లిక.

"మేమే పంపించేశాం" మెల్లగా అన్నాడు కౌశిక్.

"కాదు తగిలేసారు. మీ సూటి పోటి మాటలు భరించలేక ఆమె వెళ్ళిపోయి ఉంటుంది. అసలు ఈ నెల రోజుల్లో రమణమ్మ మాస్టారిని ఎంత తీరుగా చేసిందని" బాధగా అన్నాడు రంజిత్.

అరుణిమ కల్పించుకుంటూ– "ఆడది ఒంటరిగా బ్రతకటం కష్టం అంటే అర్థం ఉంది గాని, మగాడెలాగయినా బ్రతకగలడు. నాన్నగారికి 'కో' అంటే కోటిమంది విద్యార్థులు పలుకుతారు" అంది.

సరిగ్గా ఆ సమయంలోనే పక్క గదిలోంచి దబ్బుమన్న చప్పుడయింది.

అందరం పరిగెత్తాం. మురారి మాస్టారు నేల మీద పడి విలవిల్లాడుతున్నారు.

"అయ్యో! ఎంత ఘోరం... చూసారా మీ కఠినమైన మాటలు మనసును తూట్లు పొడిచాయి" అన్నాడు రంజిత్.


"ఆయన గుండె తట్టుకోలేకనే ఇలా జరిగింది" బాధగా అన్నది ప్రవల్లిక.

తీవ్ర మనస్తాపం చుట్టేస్తోంది. మాస్టారిని ఎత్తుకుని దగ్గరిలోని పి. హెచ్. సి.కి తీసుకెళ్ళాం.

డాక్టరు పరీక్షించారు. మైల్డ్‌గా పెరాలసిస్ స్ట్రోక్ వచ్చిందని చెప్పారు. ప్రాణ భయం లేదని, రెండు నెలలపాటు దగ్గరుండి మందు లిస్తూ ఫిజియో థెరపీ చేయిస్తుంటే త్వరగా కోలుకుంటారని చెప్పారు.

మూడు రోజులపాటు ఆసుపత్రిలో ఉంచి ఇంటికి పంపేసారు.

"కౌశిక్! చూశావా! ఏ క్షణం ఎటువంటి సంఘటనలు జరుగుతాయో ఎవరం ఊహించలేం. మేం మంచో, చెడో ఇంతకాలం మాకు చదువులు చెప్పిన మా మాస్టారిగా చూసాం...



"మరి మాకు సెలవిప్పిస్తే వెళతాం..." అని లేచాను.

"వెళ్ళటం మాకూ బాధగానే ఉన్నా... మా ఉద్యోగాలు కూడా బిజీవే సెలవులూ లేవు... వెళ్ళక తప్పదు" రంజిత్ కూడా సిద్ధమైనాడు.

"కొండంత అండగా మీరంతా ఉండగా నాన్నగారికేం భయం... అమ్మా అరుణిమా... నాన్నగారి ఆలనాపాలనా దగ్గరుండి చూసుకో... తప్పకుండా త్వరలోనే మామూలు మనిషౌతారు" అని బ్యాగు సర్దుకున్నది ప్రవల్లిక.

మా కదలిక కౌశిక్, ప్రవాస్, అరుణిమల ముఖాలు కమిలేలా చేసింది.

"సార్! మీరిలా మధ్యలోనే వెళ్ళిపోతా మనడం ఏమిటో మాకదోలా అనిపిస్తోంది. దయచేసి" ప్రాధేయంగా అన్నాడు కౌశిక్.

"కడుపున పుట్టిన బిడ్డలు మీరూ– మధ్యలో వచ్చిన వాళ్ళం మేము... మీరెక్కువా? మేమెక్కువా మాస్టారికి చెప్పండి" అన్నాను.

"సంతోష్‌గారూ! మొదట మేం కటువుగానే నోరు జారాం. మా పరిస్థితి మీకు తెలుసు. పట్నంలో బిజీలో పడి ఉదయం లేచింది మొదట రాత్రి దాకా కొట్టుకులాడుతూనే ఉంటాం. ఆ ఇరుకు కొంపల్లోకి నాన్నగారిని తీసుకెళ్ళటానికి ఇబ్బందిగానే ఉంది. మేం ఇక్కడ ఉండాలన్నా వీలవని పరిస్థితి" బాధగా అన్నాడు ప్రవాస్.

"మేమూ పనులు మానుకుని ఉండలేము. మీకూ వీలవదు. మరి నాన్నగారికి ఎవరు తోడుంటారని" ప్రవల్లిక అడిగింది.

"మీకు ఇక్కడి విషయాలన్నీ ఎప్పటికప్పుడు తెలియపరచిన వారిని అడిగి చూడకూడదూ... ఎవరయినా సాయంగా ఉంటారేమో" అన్నాడు రంజిత్.

"అంతపాటి సాయం చేసేవారే ఈ ఊర్లో ఉంటే మా నాన్నగారి పరిస్థితి ఇంతదాకా వచ్చేదే కాదు" నిట్టూరుస్తూ అన్నాడు కౌశిక్.

"చూసారా! 'తోడు' అన్న రెండక్షరాల పదానికి ఎంత విలువ ఉందో. ఇప్పుడు కావలసింది మీ నాన్నగారికి 'తోడు'... ఇంత కాలం గడిచింది ఓ ఎత్తయితే ఇక నుంచీ ముందు ముందు గడపాల్సిన మీ నాన్నగారి జీవితం మరో ఎత్తు" అన్నాను అవగాహన పరుస్తూ.

కౌశిక్, ప్రవాస్, అరుణిమ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"మాస్టారికి అనుకోని ఈ ఆపద మనం ఎవరం లేని సమయంలో జరిగితే దాని పరిణామం ఎంత తీవ్రంగా ఉండేదో ఆలోచించండి" అంది ప్రవల్లిక.

"ఔను! నిజమే. నాన్నగారికి తోడుండాలన్న ఆవశ్యత ఇప్పుడు మరీ స్పష్టంగా కనిపిస్తోంది." విచారంగా అన్నది అరుణిమ.

"నిజానికి మనం ఎవరం ఎంత కనిపెట్టుకుని ఉన్నా, నిజమైన సేవలందించగలిగేది, ధైర్యాన్ని ప్రసాదించగలిగేది ఆడతోడే.... ఈ సంగతి గ్రహించే... నాన్నగారిని సంస్కరించటానికి మేం అనుసరించిన మార్గాన్ని మీరు తప్పుబట్టారు. అపార్థాలకు దారి తీసింది" అన్నాను నేను.

వారి ముగ్గురిలో బాధా పరితప్త ఛాయలు ముసురుకున్నాయి.

కొంతసేపటి నిశ్శబ్దంలోంచి చిన్నగా వెక్కుతున్న శబ్దం రాగానే, గదిలోకి వెళ్ళాం.

మరెవరో కాదు రమణమ్మ!!'

మా అలికిడికి గభాలున లేచి "బాబూ! తప్పయిపోయింది. మీ అనుమతి లేకుండా మళ్ళీ ఈ గడపలోకి అడుగుపెట్టాను. వెళ్ళిపోతా బాబూ! వెళ్ళిపోతా.... మాస్టారికిలా జరిగిందని తెలిసి మనసుండబట్టక ఇలా పరిగెత్తుకు వచ్చా! క్షమించండి బాబూ! క్షమించండి" కళ్ళు తుడుచుకుంటూ వెనుదిరిగింది.

"చూశారా ! ఆమె మీ నాన్న గారి దగ్గరున్నది కేవలం నెల రోజులు. కాని ఎంత అభిమానం, ఆప్యాయత పెంచుకున్నదో...!! ఆమెకు ఎవరూ లేరు. నాన్నగారికీ తోడు అవసరం... ఆలోచించాల్సింది మీరు" అన్నాను.

వెంటనే వడివడిగా వెళ్ళిన అరుణిమ... రమణమ్మను ఆపి లోనికి తీసుకు వచ్చింది.

అరుణిమ కన్నుల్లో గిర్రున నీళ్ళు తిరగటం గమనించాం.

"కన్న సంతానంగా మాకంటే, చదువుకున్న కృతజ్ఞతతో మీరే బాగా ఆలోచించి ఈ మంచి పనికి ఏనాడో పూనుకున్నారు. కానీ మేమే అనవసరంగా" పశ్చాత్తాపంతో ప్రవాస్.

"రమణమ్మను నాన్నగారికి శాశ్వతంగా తోడు చేసి, ఆమెలో మేం అమ్మను చూసుకుంటాం. అది మా బాధ్యతగా భావిస్తున్నాం..." నిర్ధారణగా అన్నాడు కౌశిక్.

ఆసరికే రమణమ్మ మురారి మాస్టారి మంచం దగ్గర నిలుచున్నది.

కౌశిక్, ప్రవాస్, అరుణిమలు రమణమ్మ చేతులను ఆప్యాయంగా స్పృశించారు.

ఏ ఆశయం కోసమైతే మేం నడుం కట్టామో అది సఫలీకృతమవటంతో మా మనసులు ప్రఫుల్లమైనాయి. ❁

## ఎందుకబ్బా?!




తన సినిమాలో కత్రినాకైఫ్‌ని హీరోయిన్‌గా రికమండ్ చేశాడట అక్షయ్‌కుమార్! దాంతో 'హంకో దీవానే కర్ గయే' నిర్మాతలు అమ్మడి చేత ఓ.కె. చేయించుకున్నారు. కానీ తీరా షూటింగ్ మొదలు పెట్టబోయేసరికి సల్మాన్ ఖాన్ ఆ సినిమాలో వద్దని చెప్పాడట. దాంతో అమ్మడు ఆ చిత్రాన్ని వదులుకుంది. ఈ విషయం తెలుసుకున్న అక్షయ్‌కుమార్ సల్మాన్‌ని ఉడికించడానికని మళ్ళీ తన రెండో సినిమాలో కత్రినాకైఫ్‌నే తీసుకోమని నిర్మాతలతో చెప్పాడట. ఈసారి కూడా కత్రినా కాదనకుండా ఓ.కె. అనేసిందట. అంతేకాక, ఎట్టి పరిస్థితుల్లోనూ తను ఈ సినిమా నుంచి తప్పుకోనని కూడా నిర్మాతలతో చెప్పిందట. ఎందుకో?